క్లుప్తంగా

బీరప్ప ఆలయంలో ఎమ్మెల్సీ పూజలు


ఎమ్మెల్సీ జీవన్ రెడ్డితో గ్రామస్తులు

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం అనంతారంలో ఆదివారం మొదలైన బీరప్ప స్వామి పట్నాల ఉత్సవాల్లో భాగంగా ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ఆదివారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పూరెడ్డి జమున, మాజీ సర్పంచ్ జలేందర్, నాయకులు మహేశ్, లచ్చన్న పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పలువురి పరామర్శ


నివాళి అర్పిస్తున్న జీవన్ రెడ్డి

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం మోరపల్లి గ్రామానికి చెందిన తూకుంట్ల సత్తమ్మ ఆదివారం అనారోగ్యంతో మృతి చెందగా, ఆమె కుటుంబసభ్యులను ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి పరామర్శించి, ఆమె మృతదేహానికి నివాళి అర్పించారు. వీరి వెంట ఎంపీటీసీ భూమారెడ్డి, నాయకులు జున్నురాజేందర్, గంగారాం, రాజిరెడ్డి,మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత


పోలీసులు పట్టుకున్న ఇసుక ట్రాక్టర్లు

కథలాపూర్: మండలంలోని సిరికొండ, దూలూర్ గ్రామాల శివారులో నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై నవీన్‌కుమార్ ఆదివారం తెలిపారు. పోలీస్ సిబ్బందితో కలిసి పెట్రోలింగ్ చేస్తుండగా, అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లు కనిపించాయన్నారు. వాటి వివరాలు సేకరించి ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఉచిత వైద్య శిబిరం


మందులు పంపిణీ చేస్తున్న డీఎస్పీ

మెట్‌పల్లి: లయన్స్ క్లబ్ ఆఫ్ మెట్‌పల్లి,మల్లారెడ్డి నారాయణ మల్టీ స్పెషల్ క్యాన్సర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో మెట్‌పల్లి పట్టణంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం వైద్యులు రోగులకు జనరల్ చెకప్, డెంటల్ చెకప్, గైనకాలజీ, కార్డియాలజీ, క్యాన్సర్ స్కానింగ్ చేసి, ఉచితంగా మందులను పంపిణీ చేశారు.ఈ శిబిరానికి మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వరరావు హాజరయ్యారు.కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు,తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో అంగన్‌వాడీ భవనాలు

- భయాందోళనలో చిన్నారుల తల్లిదండ్రులు
- మండలంలో 52 అంగన్‌వాడీ కేంద్రాలు
- సొంతభవనాలు లేని కేంద్రాలు 21
- మరమ్మతు చేయించాలని వేడుకోలు


ఆరవెల్లిలో శిథిలావస్థలో ఉన్న అంగన్‌వాడీ భవనం


పెగడపల్లిలో అంగన్‌వాడీ భవనం

పెగడపల్లి: గర్భిణులకు, బాలింతలకు, చిన్నారులకు సేవలందిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలు శిథిలావస్థకు చేరాయి. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో రెండేళ్ల పిల్లల నుంచి ఆరేళ్ల పిల్లలకు ఆటపాటలతో పాటు చదువు చెప్పడం, బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం అందించడం అంగన్‌వాడీలు పనిచేస్తాయి. పెగడపల్లి మండలంలో 23 గ్రామాల పరిధిలో 52 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. పెగడపల్లి, అయితిపల్లి రెండు సెక్టార్లుగా విభజించారు. 15 కేంద్రాలు కమ్యూనిటి భవనాలు, 20 కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగుతుండగా 17 కేంద్రాలకు సొంత భవనాలున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాల భవనాలు శిథిలావస్థకు చేరినా కనీస మరమ్మతులు చేపట్టే దిక్కులేదు. మండలంలోని పలు గ్రామాల్లో సొంత భవనాలున్న అంగన్‌వాడీ కేంద్రాలు శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారాయి. ఏళ్ల క్రితం వీటిని ఆయా గ్రామాల పాఠశాలల ఆవరణలో నిర్మించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఈ భవనాలకు మరమ్మతులు లేక పైకప్పులు పెచ్చులూడి పోతున్నాయి. వర్షాకాలంలో పైనుంచి ఉరుస్తూ వర్షం నీళ్లు గదిలోకి చేరి సరుకులు, రికార్డులు తడిసి పోతున్నాయని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శిథిలమైన భవనాల్లో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగునోనని అంగన్‌వాడీ సిబ్బంది, చిన్నారుల తల్లిదండ్రులు భయాందోళన చెందుతున్నారు. మండలంలో అప్పట్లో కురిసిన భారీ వర్షాలకు పెగడపల్లి కేంద్రం నంబర్ 1, ఆరవెల్లి కేంద్రం నంబరు 2, నంచర్ల తదితర గ్రామాల్లోని భవనాలు పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో తాత్కాలికంగా పాఠశాలల్లో నిర్వహిస్తున్నారు. సొంత భవనాలున్న కేంద్రాలను శిథిలావస్థకు చేరుకున్న భవనాల్లో నిర్వహిస్తుండటంతో పిల్లల తల్లిదండ్రులు సంబంధిత అధికారులను ప్రశ్నిస్తున్నారు. శిథిలావస్థలో ఉన్న కేంద్రాలకు తమ పిల్లలను పంపాలంటే పిల్లల తల్లిదండ్రులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో సరుకులు, రికార్డులను కాపాడుకోవడంలో, పిల్లలను కూర్చోబెట్టి కేంద్రాలు నడపడంలో అవస్థలు పడుతున్నామని టీచర్లు, హెల్పర్లు వాపోతున్నారు. పక్కా భవనాలున్న కేంద్రాల మరమ్మతులు గానీ, కొత్త భవనాల నిర్మాణం గురించి గానీ ఎవ్వరూ పట్టించుకోవడంలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇదిలా ఉండగా సొంత భవనాలు లేని చోట ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలంటే భవన నిర్మాణానికి స్థలాల సమస్య వెంటాడుతోందని అధికారులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి శిథిలావస్థలో ఉన్న భవనాలను మరమ్మతులు చేయించడంతో పాటు అద్దె ఇళ్లలో నిర్వహిస్తున్న కేంద్రాలకు కూడా సొంత భవనాలు నిర్మించాలి సిబ్బంది, ప్రజలు కోరుతున్నారు.

మరమ్మతు చేయాలి



అంగన్‌వాడీ భవనం పూర్తిగా దెబ్బతింది. వర్షాకాలంలోనైతే ఈ భవనంలో కేంద్రం నిర్వహించాలంటే ఇబ్బందిగా ఉంది. వర్షాకాలంలో ఈ భవనంలో కేంద్రం నడుపలేని పరిస్థితి. భవన పరిస్థితిని పరిశీలించి, ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించి మరమ్మతు చేయించాలి.
– శంకరమ్మ, అంగన్‌వాడీ టీచర్, ఆరవెల్లి

శిథిలావస్థకు చేరింది



అంగన్‌వాడీ భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. అప్పట్లో కురిసిన భారీ వర్షాలకు భవనం ఖాళీచేసి తాత్కాలికంగా పాఠశాలలోని ఓ గదిలోకి కేంద్రాన్ని మార్చి నడిపించాల్సి వచ్చింది. వర్షాలు పడితే శిథిలావస్థలో ఉన్న భవనంలో కేంద్రం కొనసాగించడం కష్టమే.
– వనజాత అంగన్‌వాడీ టీచర్, పెగడపల్లి

అధికారుల దృష్టికి..



అంగన్‌వాడీ కేంద్రాలకు ఉన్న వాటిలో కొన్ని సొంతభవనాలు శిథిలావస్థకు చేరిన మాట వాస్తవమే. అలాంటి భవనాలను గుర్తించి మరమ్మతు చేయాలని ఉన్నతాధికారులకు తెలియజేశాం. నిధులు మంజూరు చేసి భవనాలను మరమ్మతులు చేయించేలా అధికారులు కృషి చేస్తున్నారు.
– నర్సింరాణి, సీడీపీవో, మల్యాల

మున్నూరుకాపుల సంక్షేమానికి కృషి చేయాలి


నియామక పత్రం అందజేస్తున్న రాజశేఖర్

మల్లాపూర్: మున్నూరుకాపుల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని సంఘం జిల్లా అధ్యక్షుడు ఓడ్నాల రాజశేఖర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సంఘం సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మల్లాపూర్ మండల మున్నూరుకాపు సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకుని ప్రకటించారు. మున్నూరుకాపులు అన్ని రంగాల్లో రాణించాలని, ఐక్యంగా ఉంటూ బలోపేతం కావాలని ఆకాంక్షించారు. సంక్షేమ నిధిని ఏర్పాటు చేసుకొని సామాజిక కార్యక్రమాలతో పాటు నిరుపేదలైన మున్నూరుకాపు కుటుంబాలకు ఆర్థికసాయం అందించాలని సూచించారు. మండల అధ్యక్షుడిగా ముత్యాల శంకర్, ప్రధాన కార్యదర్శులుగా గజ్జి శ్రీనివాస్, సరికెల మహిపాల్, ఇతర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. లైశెట్టి వెంకన్న, బండారి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత చదువులు చదవాలి

సారంగాపూర్: ప్రతి మున్నూరుకాపు బిడ్డ ఉన్నత చదువులు చదవాలని సంఘం జిల్లా అధ్యక్షుడు వొడ్నాల రాజశేఖర్ అన్నారు. మండలంలోని కోనాపూర్ జెడ్పీ పాఠశాలలో చదవిన చుక్క రాజేశం -తిరుమల కుమార్తె చుక్క అక్షర 10వ తరగతిలో 10 జీపీఏ సాధించి ఇటీవల ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రశంసలు అందుకుంది. ఈ సందర్భంగా అక్షరను జిల్లా మున్నూరుకాపు సంఘం ఘనంగా సత్కరించింది. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది రాచకొండ శ్రీరాములు, సంఘం నాయకులు బండారి విజయ్, లైశెట్టి వెంకన్న, కొలగాని మధు, కోల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర సహాయ మంత్రికి సన్మానం

కొండగట్టు: కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌ను ఆదివారం కొడిమ్యాల మండల బీజేపీ అధ్యక్షుడు రేకులపలి రవీందర్ రెడ్డి ఢిల్లీలోని ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

దేవాలయాల కమిటీ నూతన కార్యవర్గం

ఇబ్రహీంపట్నం: మండలంలోని వేములకుర్తిలో దేవాలయాల కమిటీ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. చైర్మన్‌గా బర్మ మల్లయ్య, ఉపాధ్యక్షుడిగా కోటగిరి శ్రీనివాస్, కోశాధికారిగా గుడ్ల శ్రీధర్, రైటర్‌గా కత్రోజి సాయికృష్ణ, సభ్యులుగా రాధారపు దేవదాస్, ఆరే వినయ్, తోపారపు ప్రభాకర్, రౌతు నర్సయ్య, సున్నం భూమన్న, గంగన్న, రాజు, లక్ష్మిరాజం, ధర్మగౌడ్, గంగారాం, దత్తాద్రి, బుచ్చన్న ఎన్నికయ్యారు.

బడీడు పిల్లలను బడికి పంపించాలి

సారంగాపూర్: బడికి వెళ్లాల్సిన పిల్లలను తల్లితండ్రులు పాఠశాలలకు పంపించి, వారిని ఉన్నత చదువులు చదివించాలని సాంస్కృతిక కళాకారులు అన్నారు. సారంగాపూర్ మండల కేంద్రంలోని శ్రీరామాలయం వద్ద ఆదివారం తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులు పాటల రూపంలో ప్రజలకు అవగాహన కల్పించారు. నీటిని పొదుపుగా వాడాలని, పచ్చదనం పరిరక్షించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, బడికి పంపించాల్సిన వయస్సు ఉన్న చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని పేర్కొంటూ పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాకారులు పంచాయతీ కార్యదర్శి ప్రేమలత, కారొబార్ గంగాధర్, కళాకారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

సారంగాపూర్: మండలంలోని పోతారంలో నిల్వ ఉంచిన రేషన్‌బియ్యాన్ని ఆదివారం పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు. ఎస్సై దత్తాద్రి కథనం ప్రకారం.. పోతారం గ్రామానికి చెందిన పల్లెర్ల రవి ప్రజల నుంచి 12 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సేకరించి, అమ్ముకోవడానికి సిద్ధం కాగా, పక్కా సమాచారంతో ఇంటిపై దాడి చేసి రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని రవిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

తొలకరితో వ్యవసాయ పనులు మొదలు



మేడిపల్లి: ఉమ్మడి మేడిపల్లి మండల వ్యాప్తంగా రైతులు పంటల సాగుకు సన్నద్ధమవుతున్నారు. శుక్రవారం కురిసిన భారీ వర్షానికి అవుతున్నారు. ఆదివారం మొక్కజొన్న విత్తడం మొదలుపెట్టారు. మరో నాలుగు రోజుల్లో మండల వ్యాప్తంగా జోరుగా వ్యవసాయ పనులు ప్రారంభమవుతాయి.

బో'నమో' పెద్దమ్మ


బండలింగాపూర్‌లో పెద్దమ్మ బోనాల్లో మహిళలు


బోనం ఎత్తుకున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

మెట్‌పల్లిరూరల్ : మెట్‌పల్లి మండలం బండలింగాపూర్‌లో పెద్దమ్మ తల్లి జాతర ఉత్సవాలు వైభవంగా జరిగాయి.జాతర ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారికి బోనాలు చేశారు. పోతరాజుల విన్యాసాలతో ఊరేగింపుగా తరలివచ్చిన భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ కులస్తులు,గ్రామస్తులు పాల్గొన్నారు.

బోనాలు సంస్కృతిలో భాగం

జగిత్యాలటౌన్: బోనాలు తెలంగాణ సంస్కృతిలో భాగమని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని గాంధీనగర్ పోచమ్మ బోనాల పండుగలో భాగంగా జీవన్‌రెడ్డి స్థానిక ప్రజలతో కలిసి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ నక్క జీవన్, అడువాల లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు

ముత్యంపేటలో ..

మల్యాల:మండలంలోని ముత్యంపేటలో ఆదివారం స్థానిక ఎస్సీ కాలనీవాసులు పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలు ఎత్తుకుని, డప్పు చప్పుళ్ల మధ్య ఊరేగింపుగా పోచమ్మ ఆలయానికి తరలివెళ్లి, మొక్కులు చెల్లించుకున్నారు. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం బోనాల ఉత్సవాల్లో పాల్గొని బోనమెత్తుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను కాలనీవాసులు సన్మానించారు. కార్యక్రమంలో ఆనంద రెడ్డి, ఆదిరెడ్డి, శ్రీనివాస్ గౌడ్, శంకర్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణం


స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మెట్‌పల్లి: పట్టణంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారి కల్యాణం ఆదివారం ఘనంగా జరిగింది. ఆలయంలో అర్చనలు,అభిషేకాలు,ప్రత్యేక పూజలు, కల్యాణం వైభవంగా నిర్వహించారు. కల్యాణానికి తరలివచ్చిన భక్తులు ఉత్సవమూర్తులను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్-సరోజన దంపతులు, భక్తులు పాల్గొన్నారు.

కిష్టంపేటలో..

రాయికల్: మండలంలోని కిష్టంపేట శివభక్త మార్కండేయ స్వామి 10వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి కల్యాణం ఘనంగా నిర్వహించారు. వివిధ గ్రామాలకు చెందిన భక్తులు స్వామివారి కల్యాణానికి హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. కల్యాణానికి హాజరైన ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను ఆలయ కమిటీ సభ్యులు ఆయనను సన్మానించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయకమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కోటిలింగాలలో గాయత్రి మహాయజ్ఞం


గాయత్రీ పూజ చేస్తున్న పురోహితులు

వెల్గటూర్: మండలం లోని ప్రముఖ పుణ్యక్షేత్రం కోటిలింగాల గోదావరి తీరాన జగిత్యాల జిల్లా పద్మ బ్రాహ్మణ పురోహిత సంఘం ఆధ్వర్యంలో గాయత్రి జన్మదినం సందర్భంగా శ్రీ మహా గాయత్రీ మంత్ర పురశ్చరణ మహాయజ్ఞం ఘనంగా నిర్వహించారు. గాయత్రీ మంత్ర జపంతో తర్పణాలు వదిలి, అనంతరం అమ్మవారికి అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో జగిత్యాల జిల్లా పద్మబ్రాహ్మణ పురోహితులు పాల్గొన్నారు.

ఘనంగా సామూహిక వ్రతాలు

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి అనుబంధ ఆలయం శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలోని శివపార్వతుల కల్యాణవేదికపై ఆదివారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అనఘాష్టమీ సామూహిక వ్రతాలను ఘనంగా నిర్వహించారు. వందలాది మంది మహిళలు పాల్గొని పసుపు, కుంకుమ, పూలు, పండ్లతో అర్చనలు చేసి అమ్మవారి తీర్థప్రసాదాలను స్వీకరించారు.

ఘనంగా పెద్దన్న భీమన్న ఉత్సవాలు

గొల్లపల్లి : మండలంలోని చిల్వాకోడూర్‌లో యాదవ సంఘం ఆధ్వర్యంలో పెద్దన్న భీమన్న ఉత్సవాలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా యాదవ కుల పెద్దలు, యువతీ యువకులు, మహిళలు పెద్ద ఎత్తున తరలివెళ్లి నైవేద్యం సమర్పించి, యాటలను బలిచ్చి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో యాదవ సంఘ చైర్మన్ నక్క కొమురయ్య, వైస్ చైర్మన్ నక్క పెద్దిరాజు, సభ్యులు పాల్గొన్నారు.

యువత సామాజిక స్పృహను అలవర్చుకోవాలి

మల్లాపూర్: యువత క్రీడలతో పాటు సామాజిక స్పృహను అలవర్చుకోవాలని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బద్దం శేఖర్‌రెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి మల్లాపూర్ మండలంలోని సిరిపూర్‌లో తీగల మహిపాల్‌రెడ్డి స్మారక వాలీబాల్ టోర్నీ ముగింపు వేడుకల్లో పాల్గొని మాట్లాడారు. సిరిపూర్ వంటి గ్రామీణ ప్రాంతంలో మండల స్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని అన్నారు. అనంతరం టోర్నీ విజేతలకు ట్రోఫీలతో పాటు నగదు బహుమతి అందించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

రాపల్లిలో ఎడ్లబండ్ల పోటీలు

గొల్లపల్లి : మండలంలోని రాపల్లిలో కోల శారద స్మారక ఎడ్లబండ్ల పోటీలను ఆదివారం నిర్వహించారు. ఈ పోటీల్లో మొదటి బహుమతిగా తిర్మలాపూర్ గ్రామానికి చెందిన భాష్మియా రూ.5016, రెండో బహుమతి వెనుగుమట్లకు చెందిన ఎల్లాల మల్లారెడ్డి రూ.3016, మూడో బహుమతి జగదేవుపేటకు చెందిన బచ్చల శివకృష్ణ రూ.2016లు గెలుచుకున్నారు. గ్రామస్తులు పాల్గొన్నారు.

కాపర్‌వైర్ల దొంగతనంపై పోలీసుల ఆరా

కథలాపూర్: మండలంలోని పెగ్గెర్ల, ఊట్‌పెల్లి గ్రామాల శివారులోని ఎస్సారెస్పీ వరదకాలువకు ఏర్పాటు చేసుకున్న విద్యుత్ మోటార్ల కాపర్ వైర్ల దొంగతనంపై పోలీసులు ఆరా తీస్తున్నారు. ఈ మేరకు ఎస్సై నవీన్‌కుమార్ పెగ్గెర్ల, ఊట్‌పెల్లి శివారులో వరదకాలువ వెంబడి ఆదివారం పరిశీలించారు. కాపర్‌వైర్ల దొంగతనం జరిగిన సంఘటన స్థలం వద్ద ఆనవాళ్ల కోసం వెతికారు. బాధిత రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఐదు రోజుల వ్యవధిలో సుమారు 30 విద్యుత్‌మోటార్ల కాపర్ వైర్లు దొంగలు ఎత్తుకెళ్లినట్లు బాధిత రైతులు పేర్కొన్నారు. వానాకాలం సీజన్ సాగుకు సమాయత్తం అవుతుంటే కాపర్‌వైర్ల దొంగతనం వల్ల ఆందోళనకు గురవుతున్నామని రైతులు తెలిపారు. కాపర్‌వైర్లకు మార్కెట్లో అధికధర ఉండటంతో దొంగలు వాటిని ఎత్తుకెళ్లి విక్రయిస్తున్నారని రైతులు అంటున్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


వేంపేట జెడ్పీహెచ్ఎస్ పూర్వ విద్యార్థులు


పెగడపల్లి మండలం అయితిపల్లిలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం


జగిత్యాల పట్టణంలోని పాఠశాలలో..


కథలాపూర్ మండలం చింతకుంట జెడ్పీహెచ్ఎస్ పూర్వ విద్యార్థులు



మల్యాల జెడ్పీహెచ్ఎస్ 1986-87 బ్యాచ్ పూర్వ విద్యార్థులు

మెట్‌పల్లిరూరల్/పెగడపల్లి/ మల్యాల/ జగిత్యాలటౌన్/ కథలాపూర్: మెట్‌పల్లి మండలం వేంపేట జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో 2006-07లో పదో తరగతి చదివిన పూర్వవిద్యార్థులు, పెగడపల్లి మండలం అయితిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1991-92 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు, మల్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1986-87లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు,కథలాపూర్ మండలంలోని చింతకుంట జెడ్పీ హైస్కూల్‌లో 2006-07 విద్యాసంవత్సరం పూర్తిచేసిన పూర్వ విద్యార్థులు,జగిత్యాలపట్టణంలోని విద్యానగర్ రాజరాజేశ్వర పాఠశాలలో 2000-01 సంవత్సరం పదోతరగతిపూర్తి చేసిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా తాము చదువుకున్న రోజులను, తీపి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ ఒకరినొకరు ఆత్మీయంగా పలుకరించుకుంటూ యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. తమకు చదువు నేర్పిన గురువులను సన్మానించారు.

డిగ్రీ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం..

కోరుట్లటౌన్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుకున్న 2003-2006 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ వాసవి, లెక్చరర్స్‌ను ఘనంగా సన్మాంచారు.

వాసవీ గ్రేటర్ క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు


బుక్స్ అందిస్తున్న క్లబ్ సభ్యులు

కోరుట్ల: పట్టణంలోని వాసవీ గ్రేటర్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేశారు. పట్టణంలోని వీధి వ్యాపారులకు గొడుగులు పంపిణీ చేశారు. హోంగార్డులకు మాస్కులు, నిరుపేద విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. వాసవీ మాత అమ్మవారి పూజ సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో వాసవీ గ్రేటర్ క్లబ్ రీజినల్ చైర్మన్ మహాజన్ జితేందర్, ఇంటర్నేషనల్ అడిషనల్ ట్రెజరర్ బాల సంతోష్, ఇంటర్నేషనల్ వాసవీ క్లబ్ వైస్ ప్రెసిడెంట్ ఎలిమెల్లి మనోజ్ కుమార్, జోనల్ చైర్మన్ కొత్త సునీల్, కోరుట్ల అధ్యక్షుడు నేతి శ్రీకాంత్, పాల్గొన్నారు.